క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా అంబాల ప్రభాకర్‌రెడ్డి



వెలుగోడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా రేగడగూడురుకు చెందిన అంబాల ప్రభాకర్‌రెడ్డి మరోసారి ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా అంబాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి మరోసారి పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు కారణమైన శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 2024 ఎన్నికల్లో 2019 కంటే అత్యధిక మెజారిటీతో శిల్పా చక్రపాణిరెడ్డిని గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ప్రభాకర్‌రెడ్డిని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

ఆత్మకూరు మండల, పట్టణ అధ్యక్షులు..



రాజమోహన్ రెడ్డి, సయ్యద్ మీర్

ఆత్మకూరు రూరల్: శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు మండల, ఆత్మకూరు మున్సిపాలిటీ (పట్టణ) వైఎస్సార్‌సీపీ అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. ఆత్మకూరు పట్టణ అధ్యక్షులుగా ఎస్ఎస్ సయ్యద్ మీర్, ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షుడిగా డి. రాజమోహన్ రెడ్డిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ ఉషారాణి

మిడుతూరు: మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నాగలూటి గ్రామ సర్పంచ్ ఉషారాణి అన్నారు. శనివారం మండలపరిధిలోని నాగలూటి గ్రామంలోని వడ్డె పేట బీసీ కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రహదారి నిర్మాణ పనులు ప్రాంభించారు. సర్పంచ్ గడప గడప కార్యక్రమం కింద మంజూరైన రూ 10 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగ తులసిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నబి రసూల్, అసిస్టెంట్ ఇంజనీర్ హమీద్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ విజయవంతం

నందికొట్కూరు: సెప్టంబర్ నెలలో స్కూల్ గేమ్స్ కార్యక్రమాలు అందరి సహకారంతో విజయవంతంగా ముగిశాయని ఎంఈఓ ఫైజున్నీబేగం అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వ్యాయామ విద్యాభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. క్రీడా నైపుణ్యాలను మెరుగుపరిచి విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల కో ఆర్డినేటర్లు రవి కుమార్, శ్రీనాథ్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ డోరతి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ భూముల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్

జూపాడుబంగ్లా: 'సాక్షి' దినపత్రికలో శనివారం 'మత్స్యశాఖ భూమి మాయం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ స్పందించారు. వీఆర్వో అల్లావుద్దీన్, సర్వేయర్ సుమతి శనివా రం మత్స్యశాఖ భూములను పరిశీలించారు. వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

గుండెపోటుతో లస్కర్ మృతి

పగిడ్యాల: కర్నూలు సబ్ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు సెక్షన్ నీటిపారుదల శాఖలో ఔట్‌సోర్సింగ్ లస్కర్‌గా విధులు నిర్వహిస్తున్న మొలకల వెంకటరమణ(46) గుండెపోటుతో మృతి చెందినట్లు శ్రీశైలం ప్రాజెక్ట్ ఔట్‌సోర్సింగ్ లష్కర్ల సంఘం జిల్లా అధ్యక్షులు జి. నాగన్న శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి గుండెపోటుకు గురికాగా కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక తుదిశ్వాస విడిచినట్లు వెల్లడించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మహానందిలో మరో ఉద్యోగి సస్పెన్షన్

మహానంది: దేవస్థానంలోని పడితరం విభాగంలో ప్రొవిజన్స్ సరుకుల కొనుగోలు, వినియోగం నమోదు విషయంలో నిబంధనలు పాటించకపోవడం, భారీగా వ్యత్యాసాలు రావడంతో మరో ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఆదేశాలు జారీ చేశారు. వస్తువుల్లో అవకతవకపై విచారణ చేపట్టగా రూ.4.50లక్షల విలువ తేడా రావడంతో నీలకంఠరాజును సస్పెండ్ చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా నీలకంఠరాజు ప్రస్తుతం కసాపురంలో విధులు నిర్వహిస్తుండటంతో సస్పెన్షన్ ఉత్తర్వుల కాపీని కసాపురం ఈఓకు పంపించినట్లు తెలిసింది.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే సీఎం జగన్ లక్ష్యం



బుక్కాపురంలో వైద్యసేవలపై వివరాలు తెలుసుకుంటున్న శిల్పా భువనేశ్వరరెడ్డి

మహానంది: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ఆరోగ్య సేవలు అందిస్తూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సీఎం జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి అన్నారు. మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ యశస్వినితో కలిసి ప్రారంభించారు. తిమ్మాపురం, గాజులపల్లె ఆరోగ్య కేంద్రాల వైద్యులు డాక్టర్ భగవాన్‌దాస్, డాక్టర్ శాంతిప్రియ, డాక్టర్ వెంకటరెడ్డి, శాంతిరాం ఆస్పత్రి ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ నాగార్జునరెడ్డి, కంటివైద్య నిపుణులు డాక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుంచపు లక్ష్మీనరసమ్మ, సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ, ఎంపీడీఓ శివనాగజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు. బుక్కాపురంలో మొత్తం 417 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీఓ తెలిపారు. బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరులో ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి, ఎంపీడీఓ వాసుదేవగుప్తలు ప్రారంభించగా వైద్యులు డాక్టర్ భావనారెడ్డి, డాక్టర్ రంజిత్‌కుమారి, డాక్టర్ దినేష్‌బాబు, డాక్టర్ రోహిత్, డాక్టర్ సాయి గణేష్, డాక్టర్ కిరణ్‌కుమార్‌లు వైద్యసేవలు అందించారు. మండలంలో మొత్తం 553 మందికి వైద్యసేవలు అందించినట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు.

పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్
- నందికొట్కూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం పరిశీలన



నందికొట్కూరులో ప్రజలకు ఇచ్చిన టోకన్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

నందికొట్కూరు: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుకుని ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు పంపిణీ చేసే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం పేదలకు గొప్ప వరమన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించారు. శిబిరానికి విశేష స్పందన లభించింది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్వే గుర్తించిన ఆరోగ్య సమస్యలపై వైద్య శిబిరాల్లో పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేస్తారన్నారు. అవసరమైన వారికి కంటి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా కళ్లద్దాలు కూడా పంపిణీ చేస్తారని చెప్పారు. ఐదు దశలుగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. హెల్త్ క్యాంపులలో డాక్టర్లు సిఫారసు చేసిన రోగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను ఆరోగ్య నెట్‌వర్క్ ఆస్పత్రుతల్లో చేర్పించి మెరుగైన వైద్యం అందేలా చూస్తారన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ వెంకటరమణ, అసిస్టెంట్ డీఎంహెచ్ఓ శారద, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ కిషోర్, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మ, రూరల్ సీఐ విజయభాస్కర్, కౌన్సిలర్లు రవూఫ్, చిన్నరాజు, లాలుప్రసాద్, చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యసేవలు

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కొణిదేల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో వైద్యాధికారులు, నాయకులు జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపుకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలోదాదాపు 500 మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ రాజశేఖర్ బాబు, ఎంపీడీవో శోభారాణి, సర్పంచ్ నవీన్, వైద్యులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్యం

పాములపాడు: రాష్ట్రంలో ప్రజలందరికి మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు శ్రీకారం చుట్టారని జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి రామలింగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో వివిధ రోగాలకు సంబంధించి 536 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 121 మందికి కంటి అద్దాలు, 20 మందికి కంటి శుక్లాల ఆపరేషన్‌కు రెఫర్ చేశారు. క్యాంపెయిన్ ప్రత్యేకాధికారి రఘురాం, డిప్యూటీ డీఎంహెచ్ఓ కాంతారావు నాయక్ శిబిరాన్ని పరిశీలించారు.

కార్యక్రమంలో తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ గోపీకృష్ణ, డాక్టర్లు నాగలక్ష్మిదేవి, మౌళిక, గైనిక్ ప్రణవి, చిన్నపిల్లల వైద్యుడు పెరిన్‌బావషాన్, పీఎంఓఓ షేక్షావలి, సర్పంచు వరప్రసాద్, వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుద్యాలలో జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

కొత్తపల్లి: ప్రజలకు మెరుగైన ఆరోగ్యం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి, ఎంపీపీ కుసుమలత అన్నారు. శనివారం మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో మేరీ అధ్యక్షతన, సర్పంచ్ శోభలత ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలో అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, వైద్యాధికారులు వినోద్ కుమార్, జబీర్, విజయేంద్ర, దీపా నాగవేణి, నాగంపల్లి సింగిల్ విండో చైర్మన్ జనార్దన్ రెడ్డి, కో ఆప్టెడ్ మెంబర్ మహమ్మద్ గౌస్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె. సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ జర్‌లాబి, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పిన్నాపురంలో ప్రారంభమైన జగనన్న సురక్ష

ఆత్మకూరురూరల్: మండలంలోని పిన్నాపురం గ్రామ పంచాయతీలో శనివారం జగనన్న సురక్ష కార్యాక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యులు జి శివశంకర రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో రవీంద్ర రెడ్డి, డిప్యూటి డీఎంఅండ్ హెచ్ఓ సోమశేఖర్, వైద్యులు పవన్, గోపాల్, గోపాల్ నాయక్,ప్రసన్న, లక్ష్మీ,భరత్‌కుమార్ ఎంపీడీవో మోహన్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి



అధికారులతో మాట్లాడుతున్న పీవో రవీంద్రారెడ్డి

వెలుగోడు: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శ్రీశైలం ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి సూచించారు. పట్టణంలోని 3వ సచివాలయం వద్ద శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లా లం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్‌తో కలిసి ప్రారంభించారు. శిబిరంలో 525 మందికి వైద్య సేవలందించారు. శిబిరాన్ని జిల్లా అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాంతరామ్ నాయక్ శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఎం ఇలియాస్ ఖాన్, జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, వైద్యాధికారిణి డాక్టర్ సులోచనమ్మ, సలిమున్నిసా, వేణుగోపాల్, కృష్ణమూర్తి, జహీర్‌వలి తదితరులుపాల్గొన్నారు.

గ్రామంలోనే వైద్య సేవలు అందించడం సంతోషకరం..



ఏ వ్యాధికై నా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు ద్వారా గ్రామంలోని వైద్య సేవలు ఉచితంగా అందించడం సంతోషంగా ఉంది. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయలేని విధంగా వైయస్సార్‌సీపి ప్రభుత్వం చేస్తుంది. నేను బీపీ, షుగర్, గ్యాస్ ట్రబుల్ రోగాలతో బాధపడుతూ కర్నూలుకు వెళ్లి వైద్యం కోసం రూ.వేలకు వేలు ఖర్చు చేసుకున్నాను. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామంలోనే వైద్య సేవలు అందిస్తుండటంతో ఇక్కడికి వచ్చా. అన్ని పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఇచ్చారు.

–బాల లింగన్న, దుద్యాల

కంటి ఆపరేషన్ ఉచితంగా చేస్తామన్నారు



నాకు కంటిచూపు సరిగా లేదు. రెండేళ్ల కిందట కర్నూలుకు వెళ్లి కంటి పరీక్షలు చేయించుకున్నాను. ఆపరేషన్‌చేయాలన్నారు. రూ.18వేలు ఖర్చు అయ్యింది. ఇప్పుడు రెండవ కన్ను చూపించుకున్నాను. ఆపరేషన్‌చేయాలని చెప్పారు. ఉచితంగా చేస్తామన్నారు. నేనే కాకుండా చాలా మంది చూపించుకున్నారు. స్పెషలిస్టు డాక్టర్లు మా ఊరికి వచ్చి వైద్యం చేయడం ఊహించనిది. ఈ రోజు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు ద్వారా నాతోపాటు ఊళ్లో చాలా మందికి మేలైంది. –అబ్దుల్‌హై, తుమ్మలూరు

5న అధికారికంగా జగనన్న గృహాలు ప్రారంభం



జగనన్న లే అవుట్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

నందికొట్కూరు: ఈ నెల 5న జగనన్న గృహాలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. పట్టణంలోని జగనన్న లేఅవుట్ పరిశీలించారు. నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులతో మాట్లాడారు. రోడ్లు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల పైపులైన్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.



రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



తుమ్మలూరులో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుకు హాజరైన ప్రజలు



తుమ్మలూరులో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



వెలుగోడులో హెల్త్ క్యాంపునకు హాజరైన ప్రజలు



కొత్తపల్లిలో చిన్నపిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

మహానందీశ్వరుడి సన్నిధిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ బి.కృష్ణమోహన్‌కు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

మహానంది: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ దంపతులు శనివారం మహానందికి వచ్చారు. వారికి ఆలయ ట్రస్టీబోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డిలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జడ్జి దంపతులు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక అలంకార మండపంలో వారికి స్వామి,అమ్మవారి మెమంటో, ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐ రవీంద్ర, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో కార్పొరేట్ వసతులు

పాములపాడు: గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో కార్పొరేట్ మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్యను మాటల్లో కాకుండా చేతల్లో చూపించిన మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి రామలింగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఏఎస్ఆర్ జెడ్పీహెచ్‌స్కూలు, ఏపీ మోడల్ స్కూళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసి జగనన్న గోరుముద్దను పరిశీలించారు.

కిటికీలకు నెట్స్ విరాళం

పాఠశాలలో కిటికీలకు నెట్స్ లేకపోవడంతో కోతులు తరగతి గదిల్లోకి వస్తున్నాయని హెచ్ఎం వెంకటసుబ్బమ్మ చెప్పడంతో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి స్పందించి కిటికీలకు నెట్స్ అందజేస్తానని తెలిపారు. చెలిమిల్ల సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, నాయకులు దరగయ్య తదితరులు ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ నిర్వహణకు ఏర్పాట్లు

పగిడ్యాల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ నిర్వహణకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీఓ వెంకటరమణ శనివారం ఏర్పాట్లను షురూ చేశారు. అక్టోబర్ 3న మండలంలోని పడమర ప్రాతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మెడికల్ క్యాంప్ నిర్వహణకు షెడ్యూల్ ఉన్నందున మండల స్థాయి అధికారులతో కలిసి పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయులతో చర్చించారు. ఎంఈఓ-2 మురళీమోహన్‌రెడ్డి, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, సచివాలయ కార్యదర్శి ఇషాంబాషా తదితరులు ఉన్నారు.

రైతుల అభివృద్ధే ధ్యేయం



ఎంవీఎస్ నాగిరెడ్డితో ఈఓ, చైర్మన్

మహానంది: రైతుల అభివృద్ధి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తూ వాటిని అమలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. మహానందీశ్వరుడి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మహానందికి వచ్చారు. జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగల భరత్‌కుమార్‌రెడ్డి, ఆలయ ట్రస్టీబోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, సలహామండలి మండల చైర్మన్ శరభారెడ్డిలు ఆయనకు స్వాగతం పలికారు. శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం ఆయన ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డిలతో పలు అంశాలపై చర్చించారు. అనంతరం వారు బండిఆత్మకూరు మండలం ఓంకారం ఆలయానికి చేరుకుని పూజలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ బండిఆత్మకూరు మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, నాయకులు పల్లె మహేంద్రారెడ్డి స్వాగతం పలికి పూజలు చేయించారు.

వ్యాధులు బయటపడుతున్నాయి



వైద్యపరీక్షలు చేస్తున్న ఆరోగ్యరక్ష సిబ్బంది

శ్రీశైలంప్రాజెక్ట్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య పరీక్షల ద్వారా వ్యాధులు బయటపడుతున్నాయి. చిన్నచిన్న ఆరోగ్య సమస్యే కదా అని లైట్‌గా తీసుకుంటున్న వారికి తమ దేహంలో ఉన్న వ్యాధులు ఆరోగ్యరక్ష వైద్య పరీక్షల ద్వారా గుర్తిస్తున్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఉచితంగా వైద్యపరీక్షలు చేయడమే కాకుండా మందులను పంపిణీ చేస్తున్నారు. ప్రాజెక్ట్ కాలనీలో శనివారం పశువుల ఆసుపత్రి సమీపంలో సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ జ్వరంగా భావించిన కె.శివకుమారికి మలేరియాగా తేలింది.

శ్రీశైలంలో నేటి నుంచి సామవేదం ప్రవచనాలు

శ్రీశైలంటెంపుల్: ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ వారిచే ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు శనివారం తెలిపారు. ఆదివారం నుంచి తొమ్మిది రోజుల పాటు శ్రీశైల మహిమా విశేషాలు అనే అంశంపై ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై ప్రతిరోజు సాయంత్రం 7గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమావేశం

వెలుగోడు: స్థానిక ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో ఆదివారం 2005 – 2008వ సంవత్సరం డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం నాయకుడు బోగోలు సుదర్శన్ శనివారం తెలిపారు. దాదాపు 15 ఏళ్ల తరువాత కలిసి చదివిన విద్యార్థులందరూ సమావేశం అవుతున్నట్లు చెప్పారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

మిడుతూరు: ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈఓఆర్డీ ఫకృద్దీన్ సూచించారు. శనివారం మిడుతూరు–1 గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2 గాంధీ జయంతిని పురస్కరించుకొని 1న ఏక్ తారిఖ్ – ఏక్ ఘంటా ఏక్ సాథ్ – స్వచ్ఛత కే లీయే – శ్రమదానం కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో చెత్త, చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకునేలా అందరూ కలిసి శ్రమదానం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సుధీర్, కేశవతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతుకు పాముకాటు

జూపాడుబంగ్లా: మొక్కజొన్న పొలంలో మందు పిచికారీ చేస్తుండగా శేఖర్ అనే రైతు పాముకాటుకు గురైన ఘటన శనివారం తరిగోపుల గ్రామంలో చోటుచేసుకొంది. గమనించిన అతను వెంటనే విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారు 108లో హుటాహుటినా కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఈఎంటీ బాలఏసు, పైలెట్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలి

కొత్తపల్లి: మండల పరిధిలోని శివపురం గ్రామ సమీపంలోని ఎద్దులేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ స్వాములు, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు బొల్లు ప్రసాద్ బాబు యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఎద్దులేరు వాగును పరిశీలించారు. కే రాజేష్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి సీఎం జగన్ ప్రోత్సాహం

- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి
- అట్టహాసంగా రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, శిల్పా భువనేశ్వరరెడ్డి

మహానంది: క్రీడల అభివృద్ధికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నారని, పేద క్రీడాకారులకు సైతం ఆర్థికంగా అండగా ఉంటూ వారి ఎదుగుదలకు తోడ్పాటు ఇస్తున్నారని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి అన్నారు. మహానందిలో శనివారం ఎనిమిదో ఏపీ సబ్‌జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలోని పదమూడు జిల్లాల నుంచి బాలురు, బాలికల క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు కల్లూరి రామలింగారెడ్డి, చిన్నపురెడ్డి, బాలమద్దిలేటి, గజ్జా ఫక్కీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోండి

మహానంది నుంచి గాజులపల్లె వరకు అధ్వాన్నంగా ఉన్న రహదారి అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఆదేశించారు. మహానందికి శనివారం వచ్చిన ఆయన నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్వినిలతో కలిసి ఈఓ కార్యాలయంలో మాట్లాడారు. ఈ మేరకు రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరడంతో స్పందించిన ఎంపీ వెంటనే ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్‌రెడ్డితో ఫోన్లో మాట్లాడారు. రహదారి బాగాలేకపోవడంతో దొంగతనాలు జరుగుతుండటం బాధాకరమని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అనంతరం వారు ఆలయానికి చేరుకుని శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ వద్ద ప్రత్యేక ద్వారం, మరుగుదొడ్ల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

దారిదోపిడీపై డీఎస్పీ ఆరా

మహానంది: మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలో భక్తుల వాహనాల్లోని బ్యాగులు, వస్తువులు చోరీకి గురవుతుండటంపై నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి, రూరల్ సీఐ రవీంద్ర శనివారం మహానంది పోలీస్ స్టేషన్ చేరుకొని ఎస్ఐ నాగేంద్రప్రసాద్‌తో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ మార్గంలో హైదరాబాద్‌కు చెందిన భక్తుల బ్యాగులు శుక్రవారం రాత్రి చోరీకి గురైన విషయం తెలిసిందే. దారిదోపిడీలు, దొంగతనాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, పోలీసుల ఆధ్వర్యంలో మార్గంలో నైట్‌బీట్ ఏర్పాటు చేస్తామని ఎస్ఐ తెలిపారు. దారి సరిగా లేకపోవడం, నల్లమల ప్రాంతం కావడంతో ప్రయాణికులు ఈ మార్గంలో రాత్రి వేళల్లో ప్రయాణించకపోవడం మంచిదని సూచించారు.

పాములపాడులో 42.5మిల్లీ మీటర్ల వర్షం



దుద్యాల గ్రామసమీపంలో పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

పాములపాడు: మండలంలో శనివారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షం 42.5 మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ వర్షం రైతులకు ఎంతో మేలని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని, రబీ సీజన్‌కు ఇక ఢోకా ఉండదని పేర్కొంటున్నారు. అంతే కాకుండా ప్రస్తుతం సాగులో ఉన్న పైర్లకు చాలా మేలని చెబుతున్నారు. ఖరీఫ్‌లో బీడుగా ఉంచిన పొలాల్లో సేద్యాలు చేసేందుకు మధ్య కారు పైరు విత్తనాలు విత్తుకునేందుకు అనుకూలమని తెలిపారు.

కొత్తపల్లి మండలంలో మోస్తరు వర్షం

కొత్తపల్లి: మండలంలో శనివారం వేకుజామున మండల కేంద్రంతో పాటు గువ్వలకుంట్ల, బావాపురం, నందికుంట, దుద్యాల, కొక్కెరంచ, ఎదురుపాడు, గోకవరం, లింగాపురం, శివపురం, సింగరాజుపల్లె, గుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాలలో మోస్తరు వర్షం పడింది. మండలంలో 30.8 మి.మీల వర్షపాతం నమోదు అయింది.

జూపాడుబంగ్లాలో 24.6 మిల్లీమీటర్ల వర్షపాతం

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన వర్షం 24.6 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పాములపాడులో అత్యధికంగా వర్షపాతం నమోదు కాగా మిడుతూరులో అత్యల్పంగా 8.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. నందికొట్కూరు, పగిడ్యాలలో వర్షపాతం నమోదు కాలేదన్నారు.